

సర్దుకుపోయే
— సంసారం

# క్షమాపణ

శ్రీ కా॥ శ్రీ. రామమూర్తి.

శివరాం, ఒకదినం మామూలు ప్రకారము క్లబ్బు నుంచి యింటికి వెడదామని బయలుదేరాడు. గుమ్మం దగ్గర ఓక స్త్రీ నిలబడి వుంది. ఆమె, యితనిని చూసి భయపడుతూ సమీపించింది. "అయ్యా! మీరేనా శివరాంగారు" అని అడిగింది. అతనువిసుగ్గా "యేం! నీకేం కావాలి" అని అడిగాడు. ఆమె ఒక్క నిట్టూర్పు విడిచింది. "నాకేమీ అక్కరలేదు. మాలతి పంపింది. మీకు జ్ఞాపకముందా మీ స్నేహితురాలు? ఆమె మరణావస్థలో ఉంది యిప్పుడు. పాపం."

మాలతి పేరు వినడంతోనే శివరాం త్రుళ్ళిపడ్డాడు. ఎన్నో ఊహలు పరిగెత్తాయి. పాత విషయాలు జ్ఞాపకం వచ్చాయి. శివరాంకు, యింటికి పోదామని ఉండడంచేత ఒక ఐదు రూపాయలనోటు వేసి యివ్వబోయాడు. గాలికి ఆకాగితం అతనిచేతిలో టపటప కొట్టుకుంది. ఆమె దానినిచూసి. "అయ్యా! ఆమెకివేమీ అక్కరలేదు. మాలతి దగ్గర డబ్బు లేకపోయినా, డబ్బు కావలసిన స్థితిలో లేదు. మిమ్ము ఒక్కసారి చూడాలని వుంది ఆమెకు. ఇది చనిపోవుచున

మాలతికోరిక. మీలాంటి భాగ్యవంతుల విశాల హృదయంలో కొంచెం దయకు చోటులేక పోతుందా!" అంది.

ఆమె అతని సందేహంచూసి, "మీరేమీ భయపడనక్కరలేదు. మిమ్మల్ని ఒక దేవతగా ఆరాధిస్తోంది- యింకా ఆమె యిప్పటివరకు; మీరు మరచిపోయినా" అని జవాబు చెప్పింది.

'సరే' అని అతడు తన కారులో ఆమెనుకూడ ఎక్కించుకొని బయలు దేరాడు.

కారులో ఎవరూ మాట్లాడలేదు. ఆమె తన స్నేహితురాలి కోరిక తీర్చుతున్నానుగదా యని సంతోషిస్తోంది. అతను, తాహాతు తక్కువైన మనిషి తన పక్క కూర్చుందిగదాయని లోపల చాల బాధపడుతున్నాడు.

"మాలతికి ఎన్నాళ్ళనుంచి జబ్బు" అని అడిగాడు.

"ఆమె మాటలవల్ల ఒక యేడాదినుంచి అని తేల్తుంది. నాకు ఆమెను ఆరునెలలనుంచే తెలుసు. ఆమె మా బసలోకి వచ్చింది. ఆమెను అందరూ ప్రేమిస్తారు;- అంత మంచి హృదయం ఆమెది. నాపిల్లవాడిని బ్రతికించింది ఆమె...మీకోసం వెతుకుతున్నా ఒకవారంనుంచి. మీ ఆనవాళ్ళన్నీ చెప్పింది...ఆమె యింక అట్టేకాలం బ్రతుకదు. మీరు చూసినప్పటికీ యిప్పటికీ చాలా భేదం కనిపిస్తుంది ఆమెలో. పాపం విచారంవల్ల ఆమె యీ స్థితికి వచ్చింది. ఆమె గడచినజీవితం కూడా కొంత మార్పు కలిగించిందేమో ఆమెలో."

ఆమె మాట్లాడినంత కాలమూ, శివరాం ఏదో ఆలోచిస్తునే వున్నాడు. తనపక్క కూర్చున్న ఆమెను చూసి అసహ్యించుకొన్నాడు. ఎంతో సంతోషంగా గడచిన దనుకొన్న రోజు, చివరకి విషాదంగా పరిణమిస్తుందే అని విసుక్కున్నాడు. కాని మాలతి తలపుకు వచ్చినప్పుడు ఒక నిట్టూర్పు విడచాడు.

మాలతిని, శివరాం మరచిపోలేదు. ఆమె తో ఒక సంవత్సరం గడిపాడు. ఆ నీలాల్లాంటి కళ్లు, నిగనిగ లాడే శరీర కాంతి, కోరిక లూరించే పెదవులూ, తలచుకొన్నప్పుడల్లా సంతోషం కలిగిస్తున్నాయి. ఆమె మాటలన్నీ మూటలుకట్టి దాచాడా రోజుల్లో. కాగలింతల్లో ముంచెత్తి తేల్చారు వారి శరీరాల్ని. క్రమంగా ఆమెపై మోజు నశింప సాగింది. వాడిపోయిన పువ్వులా ఆమెను నలిపి పారవేశాడా దుర్మార్గుడు. నమ్మించి ద్రోహం చేశాడా పశువు. తిరిగి ఆమెను తన కాళ్లదగ్గరకు తీసుకువచ్చాడు దేవుడు- వాడికి దేవుడంటూ ఒకడుంటే. ఇప్పుడు ఆమెను తెలియదని ఎలా అంటాడు?

'ఆమెకు ఎక్కువగా వుందా జబ్బు' అని అడిగాడు.

'అయ్యో మీకెందుకు పిచ్చినమ్మకం. ఆమె బ్రతకలేదు, చిక్కి శల్యమైపోయింది.'

మాలతి యిలా వుందేమో యిప్పుడు అని మనస్సులో బొమ్మను చిత్రించడానికి ప్రయత్నించాడు. కాని పూర్వపు మాలతే జ్ఞాపకం వచ్చేది- ఎంత ప్రయత్నించినా.

కారు ఆగింది. ఆ యింట్లోనికి వారిద్దరూ వెళ్ళేరు. అతనిని గుమ్మం దగ్గర నిలబెట్టి దీపం తీసుకువచ్చి దారి చూపింది.

ఆ గది, మాలతి దీనావస్థను చెపుతోంది. నెమ్మదిగా ప్రక్క దగ్గరకు వెళ్ళి, నన్నంగా మాట్లాడాడు.

"నేను- మాలతీ! నన్ను రమ్మన్నావుట; వచ్చాను." మాలతి కళ్లుతెరిచింది. కూర్చుంది అతని రెండుచేతులూ తన పాలిపోయిన చేతులతో పట్టుకుంది.

"నువ్వే! నువ్వే! నువ్వు చాలా మంచివాడవు. నన్ను క్షమిస్తావా శివరాం!"

అతనికి నవ్వు వచ్చింది. తను క్షమించడమట మాలతిని. ఆ గుడ్డిదీపం వెలుతురులో శివరాం ఆమెను చూశాడు. పూర్వపు మాలతే కాదు. పాలిపోయిన ముఖం, దించుకుపోయినకళ్ళు, ఎండిపోయిన పెదవులూ, అట్టలు గట్టిన జుట్టూ, కంఠంలోని నరాలన్నీ పైకిబడ్డాయి. కాని కళ్ళలో వున్న జ్యోతి మాత్రం నశించలేదు. ఆమె కళ్ళు నవ్వుతూ ప్రేమాహ్వానాలు చేస్తున్నాయి.

'నీకు చాలా రోజులనుంచి జబ్బుగా వుందా! మంచిమందు రేపు పంపిస్తాను. నింపాదిగా వుంటుంది. భయపడకు."

"నాకు ఇప్పుడామందు? మితిమీరిపోయింది. ఇంక బ్రతకాలని లేదు."

ఆయాసంచే వెనక్కి పడిపోయింది. కళ్ళు వాటంతటవే మూసుకుపోయాయి. రెప్ప వాల్చకుండా చూశాడు శివరాం, మాలతిని. ప్రతి అవయవము లోనూ ఆమె దీనావస్థ కనబడుతోంది.

"మాలతీ! నేను చెడ్డవాడినే. కాని నాకు ముందు కబురంప లేదేం" అని సన్నంగా అన్నాడు.

"నీకు, నా అవసరం యింక లేదని, నన్ను వదలివేశావని నాకు తెలుసును. నాకు అది అర్థమయింది. కాని చాలకాలంవరకు నమ్మలేకపోయాను. నా అవస్థ నీకేం తెలుసు. ఒకస్త్రీ ఒంటరిగా వుందంటే- తను చేసిన పాపంతో జీవితం గడపాలంటే- ఎంత కష్టమో నీకు తెలుసా? నేను యోగ్యురాలినే అవాలని వుండేది సుమా! ఇలా అవుతుందని ఎవరికి తెలుసు" అని వెక్కివెక్కి ఏడ్చింది.

శివరాం, ఉద్రేకంగా ఆమె నుదుటిని ముద్దెట్టుకున్నాడు.

"నన్ను క్షమించవా" అని దీనంగా అడిగాడు.

"నిన్ను అప్పుడే క్షమించాను. నేను నిన్నే ప్రేమించాను. ప్రేమ నీ తప్పులన్నిటినీ కడిగివేసింది. నీకు అనేకమంది స్త్రీలున్నారు. అందులో నేనొకర్తెను కాని నాకో నువ్వొకడివేసుమా! నేను నీ జీవితంలో నలుసును. నీకు అన్నీ అర్పించాను. నా తల్లి దండ్రులని, చెల్లెల్ని తలచుకుంటే... వారి గౌరవము కూడా నీకే అర్పించాను. అందుకే దేవుడు యిలా చేశాడు."

"నీ తల్లిదండ్రులని చూశావా?"

"లేదు. నీతో ఉన్నప్పుడు రెండుత్తరాలు వ్రాశాను. నీ మనస్సు నొప్పిస్తానని చెప్పలేదు నీతోటి. జబాబు రాలేదు. అంత ఆశ్చర్యం కలిగించలేదు మానాన్న చాలా గర్వి. కుటుంబ మర్యాదంటే తలైనా యిచ్చేస్తాడు. నీవు వదలివేసిన తరువాత నేను వారి దగ్గరకు వెళ్లలేదు. నాకూ గర్వం వుంది. అయినా వెళ్ళినా ఏం ఫలం. నా పాపపు జీవితంతో వారిని కూడా మలినం చేసేస్తానేమో? వారు, నేను చనిపోయారని తలిస్తే సంతోషిస్తాను."

దగ్గుతో ఆమె ఆపాదమస్తకం కదలిపోయింది. శివరాం, ఆమె తలగడా సర్ది మాట్లాడ వద్దన్నాడు. కాని ఆమె వినలేదు.

"కాని చావుమాత్రం త్వరగా వస్తుందా?... రోజుకురోజు నా డబ్బయిపోయింది. చావేమంచిది... నేను చనిపోయాక చూస్తావు కదూ శివరాం!"

ఆమె మోచేతిపైఆని లేచించి.

"నువ్వు వెళ్ళిపో! నా విషాద చరిత్రలో నిన్ను బాధ పెడుతున్నాను. నువ్వు నన్ను ద్వేషిస్తున్నావని తెలుసు, అది నాతప్పే. వెళ్ళిపో; నన్ను ఒంటరిగా చనిపోనియ్యి......శివరాం! నీ మాలతిగానేవుంటే నే చనిపోయి ఉందునా?"

శివరాం హృదయం కరిగిపోయింది. నెమ్మదిగా ఆమెను తన కౌగిల్లోకి తీసుకున్నాడు. ప్రాణాలు

రోజులు జ్ఞాపకంవచ్చాయి. అప్పుడు ఎన్నోవిధాల ఓదార్చేవాడు. నేడా మాటలే రాలేదు. పెదవులు వణకాయి.

"మాలతీ! భయపడకు. నువ్వు బ్రతుకుతావు. నీకు కావలసినవన్నీ తెస్తాను. నీకు ఆనందం కలిగేది చేస్తాను. అదేమిటో తెలుసా! నీ తల్లి దండ్రులని వెదకి, వారు నిన్ను క్షమించునట్లు చేసి, తీసుకువస్తాను."

ఆ మాటలతో అమె తేరుకొంది. జీవించినట్లే తలచింది ఆమె. పాపం!

"నువ్వు దయకలవాడివి. నాకు జీవించాలనిలేదు. కాని నా తల్లితండ్రులకు నేను పశ్చాత్తాప పడ్డానని తెలిస్తే చాలు. వారు నన్ను క్షమించారని తెలిస్తే నా అసువులు సుఖంగా తేలిపోతాయి. నాతండ్రి మంచివాడు. క్షమిస్తాడు... నేను ఒకనాడు నా అవమానాన్ని అణగద్రొక్కి నాతల్లిని చూడ్డానికి వెళ్ళేను. వారు అక్కడలేరు. వారు ఎక్కడవున్నారో తెలియదు......నీ దయకు మితంలేదు. నేను యిప్పుడు సుఖంగా వున్నాను. నీకు కబురు పంపించక పోవలసిందే కాని...ఒక నేను...ఏమీ తోచింది కాదు. "ఆఖరిమాటలు నెమ్మదిగా మాట్లాడింది. ఆయాసంచే నిద్రపోయింది.

శివరాం, కళ్ళవెంట నీళ్లు ప్రవహించాయి. లేచి వెళ్లిపోయాడు.

దీక్షతో పదిరోజులు ఆమె తల్లి దండ్రులకోసం వెతికాడు. వెతికించాడు. చివరకు వారియిల్లు తెలుసుకొని వెళ్లేడు. మాలతి తండ్రితో, వారికుమార్తె చనిపోవుచున్నదని, వారిని చూడాలని వుందనీ, తనకు ఒక స్త్రీ—తమ కుమార్తె దగ్గరున్న స్త్రీ—చెప్పిందని చెప్పాడు.

మాలతితండ్రి, కోపంతో మండిపోయాడు. "అయ్యా! మాకు మర్యాద గౌరవం వున్నాయి. నేను ఆమెను చూడను...ఆమెను ఎవడు యీ స్థితిలోకి తెచ్చాడో తెలిస్తే చంపివేస్తాను." అని కోపంగా పలికాడు. కాని, కొత్త మనిషితో తనకోపం వెళ్లబుచ్చానేయని సర్దుకొని. "నన్ను క్షమించండి. ముసలితనంచే నాబాధ మీతో చెప్పాను. ఏమీ అనుకోకండి" అన్నాడు. శివరాం తగిన మాటలు చెప్పి ఊరుకున్నాడు.

మాలతి చెల్లెలు తండ్రిని ప్రార్థించి, సెలవు తీసుకొని తల్లితో శివరాంతో మాలతి దగ్గరకు బయలు దేరింది. శివరాం వారిని మాలతి యింటివద్ద దిగబెట్టి వెళ్లిపోయాడు.

మాలతి తండ్రి, మాటలు శివరాంచెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. పాపము! వారిని మోసగించానుగదా యని అతని హృదయం ఆత్రపడింది. వారిముందు తను పెద్దమనిషిలా మెలిగాడు నేడు.

శివరాం సాయంకాలము వెళ్లేడు మాలతి గదిలోకి. ఒకమూల మాలతి తల్లి కూర్చుని ఏడుస్తోంది. చెల్లెలు పాలుపోస్తోంది గొంతులోకి. మాలతి మరణానికి ఎదురు చూస్తోంది.

శివరాం మంచం దగ్గరకి వెళ్లి వంగున్నాడు.

"మాలతీ! నీవు యిప్పుడు సంతోషిస్తున్నావా! నా తప్పుకు నన్ను క్షమిస్తావా!" అని దీనంగా ప్రార్థించాడు. ఆమె తన చేతులతో అతని తలనువంచి ముద్దుపెట్టుకుంది. శివరాంవెనక కేక వినబడింది. మాలతి తల్లి— శివరాం చెయ్యి పట్టుకుని—

"నువ్వే! నువ్వేకాదూ! మా పిల్లని ద్రోహం చేశావు...పో...ఎదుట ఉండకు."

ఆశ్చర్యంగా శివరాం తటపటాయించాడు. ఆమె, రోగికిని శివరాంకు మధ్య నిలబడింది.

"వెళ్లిపో. దుర్మార్గుడా. తక్షణమే...మా మాలతిని, తల్లికి యిప్పుడైనా వదిలేయి."

శివరాం తలవంచుకొని నడిచాడు.